

90 రోజుల్లో.. జగన్ సర్కార్ పతనం



సభావేదికపై చంద్రబాబుతో పాటు టీడీపీ జిల్లా నాయకులు

- వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి తిమింగలాలు
- పశ్చిమలో నిలిచిన అభివృద్ధి.. టీడీపీ-జనసేన కూటమిదే గెలుపు
- అధికారంలోకి రాగానే మూడు పంటలకు సాగు నీరు
- పోలవరం ప్రాజెక్టు పూర్తి.. ఆక్వాకు రాయితీలు ఇస్తాం
- ఆచంట సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

భీమవరం/ఆచంట, జనవరి 7 : 'పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉభయ గోదావరి జిల్లాల్లో మూడు పంటలకు సాగు నీరందిస్తాం. ఆక్వా రంగానికి రాయితీ ఇచ్చి పూర్వ వైభవం తీసుకువస్తాం. జగన్మోహన్‌రెడ్డి వైసీపీ హయాంలో రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు తగ్గింది. రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్ అందజేస్తాం' అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం టీడీపీ, జనసేన నిర్వహించిన 'రా కదలిరా' సభలో చంద్రబాబు ఉద్వేగంగా మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు మహిళలు కదలి వచ్చారు. 'ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయం. 90 రోజులు కష్టపడండి. ప్రజలను చైతన్యపరచండి. టీడీపీ-జనసేన కూటమి ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లండి. విజయం మనదే' అంటూ చంద్రబాబు కార్యకర్తకు దిశా నిర్దేశం చేశారు. అధికార పార్టీ నేతలు అవినీతి తిమింగలాలు, జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి చక్రవర్తులు. ఆచంట ఎమ్మెల్యే రంగనాథరాజు అవినీతి తిమింగలం. ఇళ్ల స్థలాల సేకరణలో కోట్లు దోచుకున్నారు. చెరువులు తవ్వితే కమిషన్ తీసుకుంటున్నారు. భారతీయ విద్యాభవన్ సొమ్ములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏదో ఊహించు కుని ఎగిరిపడుతున్నాడు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నీ కక్కిస్తాం. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తన సొంత గ్రామంలో రైతులకు గోనె సంచులు ఇవ్వలేని ఎర్రి పప్ప. తణుకులో నిర్మాణాలు చేప డితే ఐదు శాతం కమీషన్ ఇవ్వాలి. టీడీఆర్ కుంభకోణంలో కోట్లు దోచుకుని వైసీపీ నేతలకు ఆదర్శంగా నిలిచారు. తణుకులో టీడీఆర్ కుంభకోణం చూసి రాష్ట్రమంతా టీడీఆర్ బాండ్లు ఇస్తున్నారు. తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ఉన్నారు. చిలక్కొట్టుడు సత్యనారాయణ. భవనాలు నిర్మిస్తే కమిషన్‌లు ఇవ్వాల్సిందే. ఎవరిని విడిచిపెట్టడం లేదు. కోట్లు కొల్లగొడుతున్నాడు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గజ దొంగ. భూములను ఆక్రమించుకుని రూ.52 కోట్లు దోచేశారు. సీఎం జగన్ విశాఖ రుషికొండలో ప్యాలస్ మాదిరిగానే భీమవరంలోనూ గ్రంధి శ్రీనివాస్ సొంత ప్యాలెస్ నిర్మించుకుంటున్నారు. ఇక నరసాపురంలో ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్టు నిర్మించి రూ.15 కోట్లు బొక్కేశాడు. తక్కువ ధరకు భూములు కొని ఎక్కువ ధరకు విక్రయించి కోట్లు గడించారు. ఇలా అవినీతికి పాల్పడుతున్న వీరందరిని తప్పించే దమ్ము జగన్‌కు ఉందా ? అంటూ చంద్రబాబు నిలదీశారు.



చంద్రబాబుతో జనసేన ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గోవిందరావు మాటా మంతీ

స్థానిక సమస్యల ప్రస్తావన

నిడదవోలు, పాలకొల్లు, తణుకుకు కావాల్సిన మంచినీటి పైపులైన్ ప్రాజెక్టు నిలిచిపోయింది. బియ్యపుతిప్ప హార్బర్ పనులు ప్రారంభం కాలేదు. ఎన్ఐటీకి భూములు ఇవ్వలేదు. కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. రోడ్లు కూడా నిర్మించలేకపోయారు. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాను అభివృద్ధి చేస్తాం. అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. 2014లో 15 సీట్లు ఎమ్మెల్యే ఇచ్చారు. ఇప్పుడు అదే సత్తా చాటాలి. ఉమ్మడి పశ్చిమలో 15 సీట్లు గెలిపించాలి. ప్రజల్లో మార్పు వచ్చిందనడానికి సభకు విచ్చేసిన యువతే నిదర్శం' అంటూ పేర్కొన్నారు. దాదాపు గంటసేపు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. బాబు మాట్లాడుతున్నంత సేపు జనం కదలలేదు. హర్షధ్వానాలతో మద్దతు ప్రకటించారు. చంద్రబాబు చేసిన ప్రతీ విన్నపం పైన స్పందించారు. అండగా మేముంటా మంటూ కార్యకర్తలు, నాయకులు, మహిళలు జేజేలు పలికారు. సభకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా, సమావేశంలో పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల టీడీపీ అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు, కెఎస్ జవహర్, జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవింద రావు, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ మంత్రులు పీతల సుజాత, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు కలవపూడి శివ, ఆరిమిల్లి రాధాకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, ఇన్‌చార్జిలు వలవల బాబ్జి, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న మహిళ



మహిళల ఉత్సాహం



యువకుల కేరింతలు



సభకు వస్తున్న అభిమానులు, కార్యకర్తలు



ఉప్పొంగిన ఆచంట..

ఆచంట/పెనుగొండ, జనవరి 7 : నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం సాగించిన అరాచకాలను ఎండగట్టారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల ఆక్రమాలను వివరించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ.. వస్తే ఏం చేస్తామో విశదీకరిస్తూ.. సాగింది.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి ప్రసంగం.ఆచంటలో ఆదివారం జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభ జనంతో కిక్కిరిసింది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నుంచి వచ్చిన జనంతో ఆచంట కిక్కిరిసింది. సభకు అశేషంగా జనం రావడంతో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం నెలకొంది. టీడీపీ, జనసేన యువకులు ఫ్లెక్సీలు, జెండాలతో కేరింతలు కొట్టారు. సభ రెండున్నర గంటలపాటు జరగ్గా వచ్చిన జనం సభ పూర్తయ్యే వరకు అలాగే ఉండిపోయారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు వచ్చే మధ్యలో చంద్రబాబు ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వ రుడిని దర్శించుకున్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం వచ్చి, ప్రజలకు మంచి చేసే శక్తిని తనకు ఇవ్వాలని కోరుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఆలయం వద్ద టీడీపీ నాయకుడు బోడపాటి దుర్గాప్రసాద్ ఏర్పాటుచేసిన కమలా ఫలాలు దండతో స్వాగతం పలికారు. సభా వేదికపై జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు గజమాలతో సత్కరించారు.

పర్యటన సాగిందిలా..

చంద్రబాబు తిరువూరు నుంచి సాయంత్రం 4.05 గంటలకు ఆచంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 4.50 గంటలకు ఆచంటేశ్వరుని దర్శించుకున్నారు. 5.20కు సభా స్థలికి చేరుకున్నారు. 5.35కు బాబు ప్రసంగం ప్రారంభించి 6.30కు ముగించారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజమండ్రి ఎయిర్ పోర్టుకు బయలుదేరి వెళ్లారు. ఆచంటలో 2.30 గంటలపాటు చంద్రబాబు సాగింది.

భువిపై.. చుక్కల పండుగ

ఏలూరులో ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- విజేతలకు బహుమతుల అందజేత
- సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న కృషి భేషంటూ ఆంధ్రజ్యోతికి వక్తల కితాబు

ఏలూరు సిటీ, జనవరి 7 : భువిపై హరివిల్లు విరిసింది. సంక్రాంతి సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. బంతిపూలు, గొబ్బెమ్మలు, రంగురంగులతో అలంకరించిన ముగ్గులతో సంక్రాంతి సందడి ముందుగానే కన్పించింది. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్నర్ స్వర్గసీమ సుకేతన' సారథ్యంలో చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చింతమనేని ప్రభాకర్, అనురాధ కన్‌స్ట్రక్షన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సౌజన్యంతో ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్‌లో పోటీలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి విచ్చేసి మొత్తం 54 మంది మహిళలు పాల్గొన్నారు.

ఉదయం 8గంటల నుంచే పోటీ వేదిక వద్ద సంక్రాంతి పండుగ వాతావరణం కనిపించింది. ప్రతి ముగ్గులోను సంక్రాంతి సంప్రదాయాలను కనబరుస్తూ వనితలు తమ ప్రతిభను చాటారు. సంస్కృతీ సాంప్రదాయాలను పెంపొందించే ఈ ముగ్గుల పోటీల్లో తమను భాగస్వాములు చేయడం ఎంతో ఆనందం కలిగించిందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఏటా ముగ్గుల పోటీలను కొనసాగించాలని, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని, అందంగా ముగ్గులు వేయడం ఒక కళ అని వారు పేర్కొన్నారు. మహిళలు ముగ్గులు వేయడంలో మిళితమైన ఆరోగ్య సంప్రదాయలను పాటించాలని సూచించారు. ఏటా క్రమం తప్పకుండా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ సంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని పలువురు వక్తలు అభినందించారు. కార్యక్రమంలో అంబికా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా, మల్బార్ గోల్డ్ ఏలూరు బ్రాంచి మేనేజర్ ప్రేమ్, ఆర్ఎస్ షాపింగ్‌మాల్ ప్రతినిధి జి.సుబ్బారావు, గంజి బెస్లీ, ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్ కోఆర్డినేటర్ జీవీఎస్ఎస్ రాజు, బ్యూరో ఇన్‌చార్జి జి.మధుసూదన్, ఆంధ్రజ్యోతి సిబ్బంది సీహెచ్ రామకృష్ణ, శ్రీధర్, సాగర్, మురళీమోహన్, బెనర్జీ, వరప్రసాద్, సూరిబాబు, శివపరమేశ్వరరావు, శ్రీనివాస్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

విజేతలకు బహుమతులు

ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో పోలవరానికి చెందిన టి.ఆదిశ్రీ (రూ.6వేలు), ద్వితీయ స్థానంలో హనుమాన్ జంక్షన్‌కు చెందిన కె.రేణుకాదేవి (రూ.4 వేలు), తృతీయ స్థానంలో ఏలూరుకు చెందిన వై.నాగదేవి (రూ.3వేలు) నిలిచి నగదు బహుమతులను అందుకున్నారు. ఇవి గాక ఇంకా ఏడు స్పెషల్ కన్సొలేషన్, 15 కన్సొలేషన్, పోటీల్లో పాల్గొని ముగ్గులు వేసిన అందరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. వీరికి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు, అంబికా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా, మల్బార్ గోల్డ్ ఏలూరు బ్రాంచి మేనేజరు ప్రేమ్, ఆర్ఎస్ షాపింగ్ మాల్ ప్రతినిధి జి.సుబ్బారావు బహుమతులను అందజేశారు. ఏలూరుకు చెందిన ఈదర సరస్వతి, మైలవరపు సుధశ్రీ, సీహెచ్ పుష్పవల్లి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, మైలవరపు గురుశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.





రాష్ట్ర స్థాయి బహుమతి సాధించడమే లక్ష్యం

ఇప్పటి వరకు చాలా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నాను. బహుమతులు సాధించాను. ఇప్పుడు ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. రాష్ట్రస్థాయి పోటీల్లోను పాల్గొని బహుమతి సాధించాలన్నదే నా లక్ష్యం. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షనకు ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషి అభినందనీయం. మహిళలకు ఇటువంటి పోటీలను నిర్వహించడం ఎంతో ప్రోత్సాహనిస్తుంది.

- టి.ఆదిశ్రీ, మొదటి బహుమతి విజేత





ముందుగానే సంక్రాంతి సందడి

ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సంక్రాంతి అంటేనే భోగి మంటలు, ముగ్గులు, భోగిపళ్లు, పెద్దలకు దుస్తులు ఇవ్వడం వంటివి. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ముందే సంక్రాంతి సందడిని తీసుకొచ్చింది. ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు సంక్రాంతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఇటువంటి పోటీలతో మహిళలలో పోటీతత్వం పెరుగుతుంది.

- కె.రేణుకాదేవి, ద్వితీయ బహుమతి విజేత





బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది

గతేడాది ఆరోగ్య పరమైన ఇబ్బందుల వల్ల పోటీల్లో పాల్గొనలేదు. సంవత్సరం నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతి సాధించాను. నాకు చాలా ఆనందంగా ఉంది. సంక్రాంతి అంటేనే ముత్యాల ముగ్గులు గుర్తుకు వస్తాయి. ఏటా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయం.

- వై.నాగదేవి, తృతీయ బహుమతి విజేత



ముగ్గులను పరిశీలిస్తున్న రెడ్డి అప్పలనాయుడు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

కన్సొలేషన్ బహుమతుల అందజేత




ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు


ముగ్గులు వేస్తున్న మహిళలు



రతనాల రంగవల్లులు!

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు.... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన సారథ్యంలో చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతమనేని ప్రభాకర్, అనురాధ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుల సౌజన్యంతో ఏలూరు అశోక్ నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఉదయం పోటీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి 54 మంది మహిళలు పోటీల్లో పాల్గొని ముత్యాల ముగ్గులను వేశారు. సంక్రాంతి సంప్రదాయలను ప్రతిబింబజేస్తూ రంగవల్లులను వేయడం వనితలకే సాధ్యం. పోటీల నిర్వహణతో ఏలూరులో ముందే సంక్రాంతి వాతావరణం కనిపించింది. ముగ్గుల పోటీలలో విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పల నాయుడు, అంబికా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికారాజా, మల్బార్ గోల్డ్ ఏలూరు బ్రాంచి మేనేజరు ప్రేమ్, ఆర్‌ఎస్ షాపింగ్ మాల్ ప్రతినిధి జి. సుబ్బారావు బహుమతులను అందజేశారు.

- ఏలూరు సిటీ


సభలో ప్రసంగిస్తున్న చింతమనేని, పాల్గొన్న రెడ్డి అప్పలనాయుడు

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల అమలుతోనే పేదలకు న్యాయం

టి.నరసాపురం, జనవరి 7 : కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలు చేయడంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. కృష్ణాపురంలో సర్వే నెంబరు 668లో గల 5773.11 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూమిని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలసి ఆదివారం పరిశీలించారు. మండల కార్యదర్శి తాడిగడప జయరాజు అధ్యక్షతన జరిగిన సభలో శేఖర్ మాట్లాడుతూ, పేదలు ఆత్మగౌరవంతో బతకాలంటే భూపంపిణీ జరగాలన్నారు. ఫారెస్ట్ అధికారులు రిజర్వ్ ఫారెస్టు భూములను వన సంరక్షణ సమితులుగా ఏర్పాటు చేసి పేదలకు పంపిణీ చేయనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు గొలిమె బాల యేసు, సీపీఐ చింతలపూడి మండలం కార్యదర్శి కంచర్ల గుర్వయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవుల శేఖర్

'వైసీపీ ప్రభుత్వంపై అన్నివర్గాల్లో వ్యతిరేకత'

కామవరపుకోట, జనవరి 7 : వైసీపీ ప్రభుత్వంపై సమాజంలో అన్ని వర్గాల నుంచి పూర్తి వ్యతిరేకత నెలకొందని, నిరంకుశంగా పరిపాలిస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటి బాట పట్టిస్తారని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అన్నారు. వీరు శనివారం రాత్రి కోనేరు గార్డెన్స్‌ను సందర్శించారు. అధినేత కోనేరు బుజ్జియ్య, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, జగ్గవరపు ముత్తారెడ్డి, టీడీపీ ఏలూరు పార్లమెంటు రైతు విభాగం ఉపాధ్యక్షులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, తెలుగు యువత నాయకులు నన్నా హరిశ్చంద్ర, కోనేరు జయకృష్ణ, మోహన్ హాజరయ్యారు. తొలుత బాబు, రాధాలకు పూల మొక్కలను అందచేసి స్వాగతం పలికారు.


రాధాకు మొక్క అందజేస్తున్న కోనేరు

జగన్ పని ఔట్ : చింతమనేని


మాట్లాడుతున్న చింతమనేని


దెందులూరు, జనవరి 7: వైసీపీ అధినేత జగన్ పని అయిపోయిందని, కుటుంబ సభ్యులతో పాటు పార్టీ ఎమెల్యే ఎంపీ, ఎమ్మెల్సీలు, నాయకులు, ప్రజలు ఎవరూ జగన్‌ను నమ్మడం లేదని టీడీపీ-జనసేన ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చల్లచింతలపూడిలో మాజీ సర్పంచ్‌లు ముమ్మడి మోహన్‌రావు,సింహాద్రి శ్రీమన్నారాయణ, గ్రామ అధ్యక్షుడు వేమన రాముగౌడ్‌ల ,ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటి కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కర పత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నాని, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు

పెరుగుగూడెంలో పలువురు టీడీపీలో చేరిక


పెరుగుగూడెంకు చెందిన నల్లూరి శ్రీమన్నారాయణ, శివ, సుబ్బారావుతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, పావులూరి దశరథరామయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. చింతమనేని వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టమే'

పెదవేగి, జనవరి 7: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ అన్నారు. బాపిరాజుగూడెంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. జగన్ రాష్ట్రాభివృద్ధికి అడ్డంకిగా మారాడన్నారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, రాష్ట్ర మనుగడకు తిరిగి పునాది వేయాలని కోరారు. కాగితాల నర్సయ్య, రమణ, చిన్ని సాయి, సజ్జా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న సుధాకర్

మందులపై జీఎస్టీ తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఏలూరు టూటౌన్, జనవరి 7: మందులపై జీఎస్టీ తగ్గించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్ జనరల్ సెక్రటరీ యూవీ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ప్రాణాంతకమైన మందుల పై కూడా జీఎస్టీ విధించటాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఫార్మాసంస్థలు, వ్యాక్సీన్ కంపెనీలను పునరుద్ధరించాలని అన్నారు. సీఐటీయూ నేత కిషోర్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బీవీ సత్యనారాయణ, కార్యదర్శి మోహిద్దీన్, కోశాధికారిగా దుర్గారావు, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా సీతయ్య, ఉమామహేష్ ఎన్నికయ్యారు.

ఎస్మా జీవో కాపీల దహనం

27వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ఏలూరు కలెక్టరేట్, జనవరి 7: కలెక్టరేట్ వద్ద కార్మికసంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. ఎస్మా జీవో నెంబర్-2 కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఇఫ్ -2 జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ, అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం సిగ్గుచేటు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, కె.విజయలక్ష్మి, పి.భారతి, వి.సాయిబాబు, జగన్నాథం, జాన్‌బాబు, పిల్లి రామకృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మాను నిరసిస్తు జీవో కాపీలను సంఘ నేతల ఆధ్వర్యంలో దహనం చేశారు. నెహ్రూబొమ్మ సెంటరులో మానవహారం నిర్వహించారు. సంఘ నేతలు ఎస్.రామ్మోహన్, ఎం.నాగమణి మాట్లాడుతూ అత్యవసర సేవల పేరుతో ఎస్మా ప్రయోగించడం అన్యాయమన్నారు. ఎస్మాను రద్దు చేయకపోతే ప్రత్యక్ష ఉద్యమాలు చేపడతామని సీపీఎం నేత టి.రామకృష్ణ హెచ్చరించారు. కృపామణి, రామలక్ష్మీ, పుష్ప, మారమ్మ, ఆకాశమ్మ పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండల కేంద్రంలో ఎస్మా జీవో కాపీలను తగలబెడుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సీఐటీయు మండల కార్యదర్శి వై.సాయికిరణ్ మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. బాడిస సుజాత, మహాలక్ష్మీ, జానకి, రాధ రుక్మిణి, సుమలత, స్వరూప, పద్మ, అలివేలు, స్వల్ప, అనూష, సౌజన్య, విజయ, తులసి పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం బుద్ధితక్కువ పని అని సంఘ నేతలు విమర్శించారు. అంగన్‌వాడీలను ఇబ్బందిపెడుతున్న జగన్ ప్రభుత్వం తగినమూల్యం చెల్లించుకునే సమయం దగ్గర్లోనే ఉందని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె విడనాడే ప్రసక్తేలేదని అన్నారు. బి.జె.ఎస్ కుమారి, వి.ఈశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. జీవో కాపీలను దహనం చేశారు. ప్రాజెక్టు కార్యదర్శి టి.మాణిక్యం మాట్లాడుతూ, ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హేమలత, అరుణ, జగదీశ్వరి, వెంకమ్మ, అన్నపూర్ణ, సుధారాణి పాల్గొన్నారు.

● కామవరపుకోట: అంగన్‌వాడీలపై ఎస్మా ఉపయోగించడం అన్యాయమని యూనియన్ నాయకులు సుభాషిణి, శాంతి, పద్మలు పేర్కొన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద దీక్ష చేశారు.


బుట్టాయగూడెంలో జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


ఏలూరులో..


చింతలపూడిలో అంగన్‌వాడీల నినాదాలు

'జగన్‌కు గద్దె దిగే కాలం ఆసన్నమైంది'

ఏలూరుకార్పొరేషన్, జనవరి 7 : పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీలు 27 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఎస్మా వంటి చర్యలకు పాల్పడడంతో జగన్‌కు గద్దె దిగే సమయం ఆసన్నమైందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు విమర్శించారు. జనసేన కార్యాలయం వద్ద ఆదివారం అంగన్‌వాడీలతో ఆయన కొద్దిసేపు భేటీ అయ్యారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, శ్రావణ గుప్త, బొత్స మధు, అల్లు సాయిచరణ్, కందుకూరి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

లింగపాలెం, జనవరి 7: మండలంలోని కొత్తపల్లి, బాద రాల గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర పథకా లపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఉచిత బియ్యం, ఇళ్లు, రోడ్లు, ఉచిత గ్యాస్‌తో పాటు పలు సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. రాయంకుల చక్రధర్‌రావు, కుర్రా వెంకటసుబ్రహ్మణ్యేశ్వర వర ప్రసాద్, ఏవో మురళీకృష్ణ, తోటా వెంకటనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

చిట్టాలమ్మకు కుంకుమ పూజలు



నిడమర్రు జనవరి 7 : పత్తేపురం గ్రామ దేవత చిట్టాలమ్మ వార్షిక మహో త్సవాల సందర్భంగా ఆదివారం పెద్దఎత్తున మహిళలు అమ్మను దర్శించుకొని కుంకుమ పూజలు చేశారు. భజన, కోలాటం నిర్వహించారు. అనంతరం జరిగిన అమ్మవారి గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతల ఊరేగింపు

నిడమర్రు జనవరి 7 : పెదనింద్రకొలనులో ఆదివారం అయోధ్య నుంచి వచ్చిన బాల రాముని అక్షింతల కలశాలతో శోభాయాత్ర జరిగింది. ఇంటిం టికీ అక్షింతలు, రామమందిర చిత్రపటాలు, ఆహ్వానపత్రిక లను అందజేశారు. కోలాట నృత్య ప్రదర్శన అలరించింది. వేగేశ్న వెంకట సుబ్బరాజు, ఉదయగిరి పవన్ కుమార్, బండారు హనుమంతురావు పుప్పాల కొండయ్య, బేవర అప్పారావు చినిమిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో శ్రీసుదర్శన హోమం



ఏలూరు కార్పొరేషన్, జనవరి 7 : స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంవద్ద జరుగుతున్న శ్రీవారి త్రినప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. తొలుత తిరుప్పావై ప్రవచనలు, గోవింద నామ సంకీర్తనల ఆలాపన, విష్ణు సహస్రనామ పారాయణ, పాశురాల పఠన జరిపారు. కళావేదికపై వేదుల జయలక్ష్మి, గుడిపాటి శిరీష భక్తి సంగీతం నిర్వహించారు. ముక్కామల శ్రీవల్లీ బృందం ఆధ్యాత్మిక సంగీతాలను ఆలపించారు. విజయవాడకు చెందిన భారతి రాఘవ నృత్య కేంద్రం వారు అపర్ణ ప్రసాద్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిపారు. ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, యనమండ్ర వెంకట రవిప్రకాష్ శర్మ అవధాని, టీడీపీ స్వర్ణపతక గ్రహీతలు కిళాంబి వెంకట పవన కృష్ణమాచార్యుల బృందం భక్తులతో పూజలు చేయించారు. ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కిలారపు శ్రీనివాసరావు, చేదే శివసాయికృష్ణ, అట్టాడ రామకృష్ణ, కూరాళ్ళ రమాదేవి, తిప్పాని మణి, కత్తిరి ఈశ్వరి, కొండల అరుణకుమారి, గోకనబోయిన నాగలక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, జనవరి 7: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలపొంగలి నైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పూజాటికెట్ల ద్వారా రూ.25,010, లడ్డూ విక్రయాలద్వారా రూ.4725, ఫోటోలద్వారా రూ.1325, ఆలయఅభివృద్ధికి రూ.21,326 విరాళాల ద్వారా ఆదాయం వచ్చిందని ఈవో ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

కర్నాటక దంపతులకు శిశుగృహ బాలిక దత్తత


దత్తత తీసుకున్న దంపతులతో కలెక్టర్

ఏలూరుకలెక్టరేట్, జనవరి 7: కర్నాటక రాష్ట్రానికి చెందిన కె.హరీష్, పుష్ప దంపతులకు స్థానిక శిశుగృహంలో పెరుగుతున్న బాలికను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమక్షంలో ఆదివారం దత్తతకు ఇచ్చారు. దత్తత ధృవపత్రాలను కలెక్టర్ అందజేశారు. సిరి (16) అనే బాలికకోసం 2020 లో వీరు దరఖాస్తు చేసుకున్నారు. హరీష్ పంచాయతీరాజ్‌శాఖలో పనిచేస్తున్నారు. ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్. సూర్యచక్రవేణి, బాలలరక్షణ అధికారి ఆర్.రాజేష్, శిశుగృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

కుక్కునూరు, జనవరి 7 : క్రీడల్లో యువత రాణించా లని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాసరావు అన్నారు. వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో మండవ రాంరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం వైసీపీ నేత శ్యాంసుందర్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ, రావు వినోద్ ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ, యువత జూదం వైపు వెళ్లకుండా ఆటలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. యర్రంశెట్టి నాగేంద్రరావు, మల్లెల చంటి నాయుడు, వై.సాయికిరణ్, సూర్ల రాము, మన్యం సాయి, షేక్ సుకుర్, రిషిమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా' ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనం: ఏపీటీఎఫ్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7 : ఏపీటీఎఫ్ ఏలూరు జోన్ సమావేశం ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలోవున్నపుడు అంగన్‌వాడీలను ఆదుకుంటానని మాటిచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పరిష్కరించకుండా ఎస్మాను ప్రయోగించడం ప్రభుత్వ నిరంకుశచర్యలకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి ఉద్యోగుల బకాయిలన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రకాష్, రామశేషు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా' చట్టాన్ని ఉపసంహరించుకోవాలి: బీటీఏ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7: శాంతియుతంగా సమ్మెచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలపై రాష్ట్రప్రభుత్వం నిరంకుశంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ధర్మలింగం ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. నాలుగున్నరేళ్లుగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం తాత్సారంచేస్తోందన్నారు. ఉద్యమాలుచేసేవాళ్లపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. తక్షణమే ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కృత్రిమ అవయవాలకు 80 మంది ఎంపిక

ఏలూరు రూరల్, కలెక్టరేట్, జనవరి 7: హేలాపురి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమకాళ్ల పంపిణీ నిమిత్తం ఆదివారం ఎంపిక శిబిరం నిర్వహించారు. పుట్టుకతో అంగవైకల్యం, ప్రమాదాల కారణంగా కాళ్లుపోవడం, ఇతర వ్యాధులతో కాళ్లుతొలగించిన వారు నడవడానికి తోడ్పడే కృత్రిమకాళ్ల పంపిణీ చేసేందుకు క్లబ్ అధ్యక్షుడు కె.బి రావ్, కార్యదర్శి బి.సత్యనారాయణ, డి.రమాదేవి ఆధ్వర్యంలో ఎంపిక శిబిరం నిర్వహించారు. ప్రవాసాంధ్రులు కె.శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ హిమబిందు ఆర్థిక సహకారం అందించారు. సుమారు 150మంది దివ్యాంగులకు స్క్రీనింగ్‌చేసి 90 మందిని ఎంపిక చేశారు. త్వరలో వారికి కృత్రిమ అవయవాలు అందించటం జరుగుతుందని కె.బి.రావ్ తెలిపారు. జి.మాణిక్యాల రావు, కె.వేణుబాబు, పాపారావు, శ్రీరామ్, దువ్వి హేమసుందర్ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికులకు న్యాయం జరిగే వరకు సమ్మె

జంగారెడ్డిగూడెం, జనవరి 7 : మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ఆరోపించారు. జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద తమకు న్యాయం చేయాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. విఘ్నేష్ మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. కె.నాగేశ్వరరావు, బొక్క శ్రీను, ఇంగుర్తి నాగరాజు, రేలంగి నాగరాజు, యడ్లపల్లి రాజేంద్ర, కొత్తూరి శ్రీను, పొడుదోలు రమణ, కలపాల యేసు, కొత్తూరి రాంబాబు, జాలా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చింతలపూడిలో మోకాళ్లపై నిలబడి నిరసన

మోకాళ్లపై నిలబడి నిరసన

● చింతలపూడి: నగర పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. కార్యాలయం వద్ద ఏలూరు రోడ్డుపై మోకాళ్లపై నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విజయరాజు, జి.నాగరాజు, వి.పద్మ, వల్లీ, సత్యనారాయణ, మనోహర్, దేవసహాయం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సామూహిక ప్రార్థనలు


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

●ఏలూరు టూటౌన్: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు ఆదివారం సామూహిక ప్రార్థనలు చేసి తమ నిరసనలు వ్యక్తం చేశారు. యూనియన్ నాయకుడు జాన్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికైన ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల సానుకూల ధోరణితో సమస్యలు పరిష్కరించడానికి ముందుకు రావాలన్నారు. ఎన్నికలకు ముందు అలవి కాని వాగ్దానాలు చేసి మోసగించటం సరికాదన్నారు. కనీస వేతనం రూ.26వేలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, స్కిల్డ్ సెమీ స్కిల్డ్ ప్రభుత్వం నిర్ణయించిన జీతాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'రా కదలి రా' సభకు ఉంగుటూరు నేతలు

ఉంగుటూరు, జనవరి 7: పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో జరిగిన 'రా కదలి రా' సభకు టీడీపీ ఉంగుటూరు నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. తెలుగు యువత జిల్లా కన్వీనర్ రెడ్డి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెళ్లి సభలో పాల్గొన్నారు.

జనసేనలో యువతే కీలకం


మాట్లాడుతున్న పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు, జనవరి 7: జనసేన పార్టీలో యువతే కీలక మని వారి సేవలను సద్వినియోగం చేసుకుంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. జనసేన కార్యాలయంలో ఆదివారం ఐ.టి. విభాగం సమావేశం జరిగింది. ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ తదితర మాధ్యమాల్లో పవన్ కల్యాణ్ సేవలను తెలిపేలా కృషి చేయాలన్నారు. ఐ.టి. విభాగం కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానఘని గ్రంథాలయం


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదవేగి, జనవరి 7 : గ్రంథాలయం అంటే విజ్ఞానఘని అని గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడంద్వారా వ్యక్తిలో అంతర్లీనంగా ఉండే కళలు వెలికి వస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు గ్రంథపఠనం చేశారు.





టీడీపీ జెండాలతో పార్టీ శ్రేణుల ఉత్సాహం

మాజీ మంత్రి పీతల, జవహర్



ఆచంట రా..కదలి రా.. సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర



బామ్మ అభివాదం

అవినీతి మహారాజు సీఎం జగన్



చంద్రబాబుకు కమలాల దండ వేస్తున్న పార్టీశ్రేణులు

ఆచంట, జనవరి 7: రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాతో ఈ రాష్ట్ర సీఎం జగన్ అవినీతి మహారాజుగా తయారయ్యాడని మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ఆచంటలో జరిగిన రా కదలి రా.. సభలో ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నాడని, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నాడరన్నారు. ఇవి అంతమొందించాలంటే టీడీపీ, జనసేన కలిసి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్‌ను ఇంటికి పంపడానికే టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో 'రా.. కదలి రా..' సభలు జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ అధికారంలోకి రాగానే అయోధ్యలంక బ్రిడ్జి, నియోజకవర్గ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇంకా అనేక సమస్యలు తీర్చాలని పితాని చంద్రబాబు నాయుడిని సభలో అడిగారు.

జగన్‌ను ఇంటికి పంపడానికే రా.. కదలి రా.. సభలు

ఆచంట ఎమ్మెల్యే అవినీతిపరుడు..

నియోజకవర్గ ఎమ్మెల్యే రంగనాథరాజు ఒక అవినీతిపరుడని ఇళ్ల పట్టాలు ఇచ్చే సమయంలో లక్షల రూపాయలు ప్రజల వద్ద వసూలు చేశారని పితాని విమర్శించారు. పట్టాల పేరుతో సుమారు రూ.25కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఆచంట మాజీ మంత్రి ఒక సన్యాసి, ఈ సభా వేదికను అడ్డుకున్నారు. వేదిక ఇచ్చినవారిని బెదిరించారు. మూడు రోజులపాటు ఆపారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజిలెన్స్ అధికారులను పంపించారు. తాను వారికి సవాల్ విసిరాను చూస్తాం భయ పడేదిలేదు. భయపడే సభను అడ్డుకున్నారని అన్నారు. పైగా తనకు

- టీడీపీకి అధికారం వచ్చిన వెంటనే అయోధ్యలంక బ్రిడ్జి, ఇళ్ల పట్టాలు
- మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

సంబధంలేదని చెప్పడం సన్యాసి వ్యవహారంగా పేర్కొన్నారు. మార్వాడీ అతిథిగృహాన్ని అడ్డుకున్నారు. ఎదురు తిరిగాం చివరికి అంగీకరించి ఇచ్చారు. ఇక్కడ అంతా అవినీతిమయంగా మారింది. రైతుల నుంచి, రైస్ మిల్లర్స్‌నుంచి ఏటా 12 నుంచి రూ.13 కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. భారతీయ విద్యాభవన్స్‌కు సంబంధించి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌కు తెలియకుండా చనిపోయిన వారిపేరును తప్పుడు అఫిడవి ట్‌లను ఇచ్చి తప్పించిన దుర్మార్గుడు అని ధ్వజమెత్తారు. ప్రజలపై, టీడీపీ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించారు. అవన్నీ చూస్తున్నాం, తేల్చుకుంటాం అన్నారు.



ఆచంట సభ వద్ద యవత కేరింతలు

మళ్లీ బాబు రావాలి



నాలుగున్నరేళ్లుగా వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. మొన్నటి తుఫాన్‌కు వరి రైతులు దెబ్బతిన్నారు. ఆక్వా రైతులకు తీవ్ర నష్టాలు వచ్చాయి. ఈ పరిస్థితులన్నీ చక్కదిద్దాలంటే మళ్లీ చంద్రబాబు రావాలి

- తోట సీతారామలక్ష్మి, టీడీపీ పశ్చిమ గోదావరి అధ్యక్షురాలు

34 స్థానాలూ మనవే



జగన్ ప్రభుత్వం వచ్చాక అన్నింటి ధరలు పెంచేశారు. రైతులకు మద్దతు ధర లేదు. నిత్యావసరాలు, పెట్రోల్, విద్యుత్ చార్జీలు మొదలైన వాటిపై బాదుడే బాదుడు. జగన్ పని అయిపోయింది. వచ్చే ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలోని 34 అసెంబ్లీ స్థానాలు గెలుస్తాం. టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

- నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే

దుష్టపాలన అంతమొందించాలి



జగన్ దుష్ట పరిపాలనను అంతమొందించేందుకు రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుంది. మన జిల్లాలో పోలవరం ప్రాజెక్టు, రైతుల కష్టాలు పట్టించుకోలేదు. పరిపాలన భ్రష్టు పట్టింది. లంచాలు పెరిగిపోయాయి. దౌర్జన్యాలు సాగుతున్నాయి. అందరం కలిసి ఈ పాలన అంతం చేయాలి.

- వలవల బాబ్జి, తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి

మహిళలపై దాడులు జరుగుతున్నాయి



ఈ రాష్ట్రంలో మహిళా కమిషన్ పనిచేయడం లేదు. నాలుగున్నరేళ్లలో రెండు లక్షల 47 వేల మంది మహిళలపై దాడులు జరిగాయి. అత్యాచారాలు, హత్యలు దారుణాలు జరుగుతున్నా ఒక్క కేసు నమోదు చేయలేదు. నేను మహిళా కమిషన్ సభ్యులుగా పని చేశా. ఇలాంటి దారుణం చూడలేదు.

- శిరిగినీడి రాజ్యలక్ష్మి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు

ఉమ్మడి ప్రభుత్వం రావాలి



బటన్ నొక్కుడు సీఎంను ఇంటికి పంపించాలంటే రాబోయే రోజుల్లో మనం తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం స్థాపించడానికి ఈవీఎం బటన్ నొక్కాలి. ప్రజలందరూ దీనిని చేపట్టినపుడే ప్రభుత్వాన్ని సాగనంపగలం.

- కొటికలపూడి గోవిందరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు

మరో వంద రోజులు భరించాలి



జగన్ ప్రభుత్వంలో దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేదు. శిరోముండనం నుంచి హత్యలు, మృతదేహాల డోర్ డెలివరీ వరకు ఎన్నో దారుణాలు, దాడులు జరుగుతున్నాయి. మరో వంద రోజులపాటు ఈ ప్రభుత్వాన్ని భరించాల్సిందే.

- మాజీ మంత్రి కేఎస్ జవహర్, తూర్పు గోదావరి టీడీపీ అధ్యక్షుడు

రైతుల పరిస్థితి దారుణం



అన్నపూర్ణగా పిలుచుకుని జిల్లాలో రైతుల పరిస్థితి దారుణం. కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునే స్థితిలో లేరు. తేమ శాతం పేరుతో అష్టకష్టాలు పడుతున్నారు. ఆక్వా రంగ పరిస్థితి దారుణంగా తయారైంది. వీటి పరిష్కారానికి చంద్రబాబు మళ్లీ రావాలి..

- మంతెన రామరాజు, ఉండి ఎమ్మెల్యే

అరాచక, అసమర్థ పాలన



రాష్ట్రంలో అరాచక, అసమర్థ, అవినీతి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిని అంతమొందించాలి. ఇదేమి అని ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. మద్యం, ఇసుకలో దారుణమైన దోపిడీ చేస్తున్నారు. దీనిని అరికట్టాలంటే చంద్రబాబు రావాలి.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు టీడీపీ ఇన్‌చార్జి

రాష్ట్రం నాశనం కాకూడదనే..



జగన్ పాలనలో జనంపై దౌర్జన్యాలు పెరిగాయి. నర్సీపట్నంలో డాక్టర్‌పై దాడి నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం డెడ్ బాడీ పార్శిల్ వరకు ఎన్నో అకృత్యాలు కనిపించాయి. ఇక రోడ్ల అధ్వానంపై ఎంత చెప్పుకున్నా తక్కువే. 'పోలవరం'ఆగిపోయింది. రాష్ట్రం నాశనం కాకూడదనే చంద్రబాబు, పవన్ కలిసి పోరాడుతున్నారు.

- బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి

మరోసారి అవకాశమిస్తే..



రాష్ట్ర ప్రజలను జగన్ పీడిస్తున్నాడు. ఒక్క అవకాశం కోరితే ఇచ్చారు. మరోసారి ఇస్తే ఇక అంతే. ఇప్పటికే ఉత్తరాంధ్ర అనేక ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లిపోయారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలే వలస వెళ్లే అవకాశం ఉంది. ఈ దారుణాలు ఎదుర్కోవడానికి పవన్, చంద్రబాబుతో కలిసి పోరాడతున్నారు.

- బొమ్మిడి నాయకర్, జనసేన నరసాపురం ఇన్‌చార్జి

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు కేజీఆర్‌ఎల్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కేజీఆర్‌ఎల్ యాజమాన్యం

భీమవరం అర్బన్, జనవరి 7: విద్యార్థులకు చదువు తోపాటు క్రీడలు కూడా ముఖ్యమని కేజీఆర్‌ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెంటే హరినాథ్‌బాబు అన్నారు. నరసాపురం వైఎన్ కాలేజీ గ్రౌండ్‌లో గతనెల 30న జరిగిన నన్నయ ఇంటర్ యూనివర్సిటీ పరిధిలో సౌత్‌జోన్ క్రికెట్ టీమ్ సెలక్షన్స్‌లో కేజీఆర్‌ఎల్ కాలేజీ విద్యార్థి జి.చరణ్‌సాయితేజ ఎంపికైన సందర్భంగా ఆదివారం అభినందించారు. విద్యార్థిని కేజీఆర్‌ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కార్యదర్శి మెంటే రామ్మోహన్‌రావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో అప్పనవీడు విద్యార్థులు జిల్లా ఫస్ట్



జిల్లా స్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులు

పెదపాడు, జనవరి 7 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏలూరు నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పెదపాడు మండలం అప్పనవీడు హైస్కూల్ విద్యార్థుల జట్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని హెచ్‌ఎం తోట పుష్పావతి తెలిపారు. జట్టు సభ్యులైన రవికిరణ్ (10వ తరగతి), రాఘవేంద్ర (9వ), రూపిని (8వ)లను ప్రత్యేకంగా ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయిని ఎం.అమరావతి, ఎ.విజయ, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ చింతా రమాదేవి పాల్గొన్నారు.

సమగ్రశిక్ష సీఎంవో పోస్టు భర్తీపై డైలమా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7 : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) పోస్టు భర్తీపై డైలమా నెలకొంది. ప్రాజెక్టు సెక్టోరల్ అధికారుల పోస్టుల్లో ఒకటైన సీఎంవో ఉద్యోగఖాళీని డిప్యూటేషన్‌పై భర్తీచేసేందుకు విద్యాశాఖ ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం ముగ్గురు దరఖాస్తుచేసుకోగా, వీరిలో ఒకరు 50ఏళ్ల పైబడి వయస్సు గల వారు కావడంతో నిబంధనల మేరకు అనర్హుడయ్యారు. మరొకరు స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచరు కావడంతో సీఎంవో పోస్టుకు అర్హత ఉండదని తేల్చారు. ఇక లింగపాలెం ఎంఈవో-2గా పనిచేస్తున్న గెజిటెడ్ అధికారి ఒకరు ఈ పోస్టుకి దరఖాస్తుచేయగా, ఆయనను సీఎంవోగా నియమించేందుకు తగిన అర్హతలుండటంతో మార్గం సుగుమమైంది. ఈ క్రమంలో ఆయన పేరును సీఎంవో పోస్టుకి సిఫారసుచేస్తూ ఫైలును కలెక్టర్ ఆమోదం నిమిత్తం పంపించనుండగా ఓ ఉపాధ్యాయ సంఘం అభ్యంతరం తెలిపింది. ఇప్పటికే ఎంఈవో-2పోస్టులో కొనసాగుతూనే ఇన్‌చార్జి సీఎంవోగా కూడా వ్యవహరిస్తున్న ఆ అధికారి నిబంధనల ప్రకారం రెగ్యులర్ సీఎంవో పోస్టులో నియమితుడుకావడానికి అనర్హుడవుతారని పేర్కొన్నారు.ఇదే విషయమై డీఈవో శ్యాంసుందర్‌ను వివరణ కోరగా 'సీఎంవో పోస్టుకి దరఖాస్తు చేసుకున్న ముగ్గురిలో ఒక్కరికి మాత్రమే అర్హతలున్నందున ఆయనను నియమించేందుకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించాలని నిర్ణయించాం. అయితే నియామకాన్ని ఖరారు చేసేముందు ఎంఈవో-2 పోస్టును ఆయన వదులుకుంటేనే సీఎంవోగా నియమిస్తామని అంగీకారం తీసుకున్న తర్వాత మాత్రమే జరుగుతుంది 'అన్నారు.

వైభవంగా గోదాదేవికి సారె సమర్పణ



పారిజాతగిరిలో గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు



చిన్నతిరుపతిలో గోదాదేవి సమేతంగా శ్రీవారి దివ్యమూర్తులు

జంగారెడ్డిగూడెం, జనవరి 7:గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 21వ రోజు గోదా అమ్మవారికి ఆలయంలో ఉన్న సమస్త దేవతామూర్తులకు చిన్న జీయర్‌స్వామి వారి ఆధ్యాత్మిక సేవా సంస్థ, జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రములు, పలు రకాలైన పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ నైవేద్యాలు సమర్పించారు. ప్రధానార్చకుడు నల్లూరు రవికుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో గోదా అమ్మవారి ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి సారెలో ఉపయోగించిన పండ్లు, ఫలములు, గాజులు, నైవేద్యాలను భక్తులకు అందజేశారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లూరి శ్యామల, రామ సత్య వీరవెంకట అప్పారావు మాస్టారు, మాడ గోపాలకృష్ణ, మోతుకూరి సత్యనారాయణ, కొనకల్ల చంద్రశేఖర్, హిమగిరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా.. ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి7: శ్రీవారి క్షేత్రంలోని విలాస మండపంలో స్వామి, అమ్మవార్లకు ఆదివారం ఉదయం ధనుర్మాస ఉత్సవాన్ని అట్టహాసంగా జరిపారు. తొలుత స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవి అమ్మవార్లను ఆలయంలో తొళక్క వాహనంపై ఉంచి అలంకరించి, పూజలు చేశారు. ఆ తరువాత క్షేత్రపురవీధుల్లో మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

ఎక్సైజ్ దాడులు.. ముగ్గురి అరెస్ట్

చింతలపూడి, జనవరి 7: మండలంలోని యర్రంపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ఆదివారం నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. నలుగురిపై కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సాయిస్వరూప్, ఏలూరు డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

పెదపాడు, జనవరి 7 : పెదపాడు మండలం కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ చల్లా కృష్ణ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆదివారం పేకాటాడుతున్నట్టు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 7 : సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేశామని రూరల్ హెడ్‌కానిస్టేబుల్ డీవీ రమణ తెలిపారు. ఓ మహిళ సారా విక్రయిస్తుందని ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సిబ్బందితో ఆదివారం సాయంత్రం ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ళలంక గ్రామానికి వెళ్లి తనిఖీలు చేశామన్నారు. సైదు మణి అనే మహిళ ఐదు లీటర్ల సారా కలిగి ఉంది. ఆమెను అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోడి పందేలపై దాడి.. ఇద్దరి అరెస్ట్

ముసునూరు, జనవరి 7: చింతలవల్లి పంచాయతీ పరిధిలోని కొత్తూరులో ఆదివారం కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3500 నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా నాయకుడు మోహన్ రంగా



మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ

టి.నరసాపురం, జనవరి 7 : ప్రజా నాయకుడు వంగవీటి మోహన్ రంగా అని ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. తిరుమలదేవిపేట గ్రామంలో వంగవీటి యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా అందరివా డని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునా ధరరావు, టీడీపీ నాయకులు పారేపల్లి రామారావు, డీకేడీ సత్యనారాయణ, పులి శ్రీరాములు పలువురు కాపు నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

నేడు ఆటోల సమ్మె

భీమవరంటౌన్, జనవరి 7 : ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల తమ ఉపాధి దెబ్బతీస్తోందని తెలంగాణ ఆటో సంఘాలు బంద్ పాటిస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా జిల్లాలోని ఆటో యూనియన్‌లు అన్ని సోమవారం సేవలు నిలిపివేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాజకీయ పార్టీలు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీలు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే టీడీపీ ఈ హామీని ప్రచారం చేస్తోంది. త్వరలో అధికార పార్టీ కూడా ఒక నిర్ణయాన్ని తీసుకుని ఎన్నికలకు ముందుగా ఉచిత ప్రయాణం ఇస్తారని ఇప్పటికే పత్రికల్లో కథనాలు వస్తున్న నేపథ్యంలో ఆటో యూనియన్‌లు వీటికి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆటో యూనియన్ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టడం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. తెలంగాణలో పరిస్థితి తమకు రాకూడదనే ముందుగానే నిరసన తెలుపుతున్నామన్నారు.

రేపటినుంచి సంక్రాంతి సెలవులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7 :పాఠశాలలకు ఈనెల 9 నుంచి 18వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. సెలవుల అనంతరం 19వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఏలూరు జిల్లా డీఈవో పి.శ్యాంసుందర్ తెలిపారు. సెలవులు అన్ని ప్రైవేటు పాఠశాలలకు కూడా వర్తిస్తాయని, ఎక్కడైనా పాఠశాలలు తెరిచి తరగతులు నిర్వహిస్తే చట్టప్రకా రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికంగా వున్న విద్యాశాఖ తనిఖీ అధికారులు తమ పరిధిలోని ప్రైవేటు స్కూళ్లపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

హరికథకు ఆదరణ తగ్గదు

- అన్నమాచార్య ప్రాజెక్టు హరికథ కళాకారిణి కృష్ణకుమారి



కళాకారిణి కృష్ణకుమారిని సత్కరిస్తున్న కళాకారులు

భీమవరంటౌన్, జనవరి 7 : ఆధ్యాత్మిక మానసిక ప్రశాంత తకు హరికథ దోహదపడు తుందని, ఎప్పటికీ హరికథకు ఆదరణ తగ్గదని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆస్థాన హరికథ కళాకారిణి జంధ్యాల కృష్ణకుమారి అన్నారు. స్థానిక త్యాగరాజ భవనంలో జరుగుతున్న 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలకు వచ్చిన ఆమెను ఆదివారం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ హరికథలో అన్నమాచార్య చరిత్ర, వెంకటేశ్వర వైభవంపై శిక్షణ తీసుకున్నానని, తరువాత 1983నుంచి ఆస్థాన హరికథ కళాకారిణిగా స్వామివారికి సంకీర్తన సేవా చేసే భాగ్యం కలిగిందని అన్నారు. 18 ఏళ్లపాటు నిర్విరామంగా హరికథ కళాకారిణిగా చేస్తున్నానని, హరికథకు ప్రతిచోట విశేష ఆదరణ లభిస్తుందన్నారు. తన చిన్నతనం నుంచే హరికథపై మక్కువతో ఇంట్లో ప్రోత్సహించి నేర్పించారన్నారు. హరికథను 105 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధోత్సవాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వైభవ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

జడ్పీ మంజూరు చేసిన పనులు సత్వరమే పూర్తి చేయాలి : జడ్పీ ఛైర్‌పర్సన్



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 7: జడ్పీనుంచి మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తిచేయాలని మొదలు కాని పనులను సత్వరమే ప్రారంభించి పనులు చేపట్టాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జడ్పీ నిధులతో చేపట్టిన పనులపై ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణనీటి సరఫరా విభాగం శాఖల ఈఈలు, డీఈలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గాను ఎన్‌ఆర్‌ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన 604 రకాల పనులతో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి పంచాయతీ రాజ్ మూడెంచెల వ్యవస్థలలో ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, ఎంపీపీ సత్యనారాయణ, రామస్వామి, రమాకాంతరావు, రమణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఏలూరు కల్చరల్, జనవరి 7: ఏలూరులోని ఏఆర్‌డీజీకే హైస్కూల్లో 1989-90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, నాటి మధురస్మృతులను గుర్తుచేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎస్.గీత, లలితకుమారి, స్వర్ణలత, రాజ్‌కుమార్, ప్రకాశ్, అబ్దుల్లా, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



1989-90లో టెన్త్ చదివిన విద్యార్థులు







ఆగిరిపల్లి, కలిదిండి, ముసునూరుల్లో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఆగ్రహ జ్వాలలు

ఎస్మా జీవో ప్రతుల దహనం చేసిన అంగన్వాడీలు ▸▸ డిమాండ్లు అంగీకరించే వరకు సమ్మె చేస్తామని హెచ్చరిక

ముసునూరు, జనవరి 7: అంగన్వాడీలు విధుల్లో చేరకుంటే తొలగిస్తామని జగన్ సర్కార్ తీసుకువచ్చిన చీకటి చట్టానికి భయపడేది లేదని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి స్పష్టం చేశారు. ముసునూరులో ఆదివారం 27వ రోజు దీక్షలో అంగన్‌వాడీలు జీవో నంబర్ 2 కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. దీక్షలో యూనియన్ నాయకులు కె.విద్యావతి, శ్యామల, దుర్గ, మేరీ సులోచన, కృపమ్మ, జామయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను చాట్రాయిలో ఆదివారం అంగన్వాడీలు దహనం చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని, చీకటి చట్టాన్ని రద్దు చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేసి తీరాలని, సర్కార్ బెదిరింపులకు తగ్గేదేలేదని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆడపడుచులను దగా చేసిన జగన్

ఆగిరిపల్లి: సీఎం జగన్ తమను మోసం చేశాడని ఆగిరిపల్లిలో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్మాకు తాము భయపడమని జీవీ కాపీలను తగులబెట్టారు. తక్షణం తమ డిమాండ్లను అంగీకరించాలని కోరారు.

కలిదిండి: కలిదిండిలో ఆదివారం అంగన్వాడీలు ఎస్మా జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్మాకు భయపడేది లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం పార్టీ నాయకులు రవి, మహంకాళిరావు, మహిళ సంఘ నాయకులు శ్యామలరాణి, మహాలక్ష్మి మద్దతు తెలిపారు.

ముదినేపల్లి: నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం ముదినేపల్లిలో అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను దహనం చేశారు. స్థానిక మండల కార్యాలయాల సముదాయం వద్ద నిర్వహిస్తున్న నిరవధిక దీక్షా శిబిరం వద్ద యూనియన్ నాయకులు సొంగా మణి, బండి పద్మ, సూరపనేని అరుణ కుమారి తదితరుల ఆధ్వర్యంలో కలెక్టర్ ఉత్తర్వుల ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిపాటి రమేష్ సమ్మెకు సంఘీభావం తెలిపారు.

మండవల్లి: ఎస్మా చట్టం తమకు వర్తించదని, బెదిరింపులకు తాము లొంగమని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ మండవల్లిలోని దీక్షా శిబిరం వద్ద ఆదివారం ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేశారు. మండవల్లి అంగన్వాడీ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం... ప్రభుత్వాలకు భస్మాసుర హస్తం : నీలం



నూజివీడు, జనవరి 7: ఉద్యోగులపై ఎస్మా చట్టం ప్రయోగించిన ప్రభుత్వాలు తిరిగి అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగుల నేత నీలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు నియంతృత్వ పోకడలతో ఉద్యోగులను అణచి వేయాలని ప్రయత్నిస్తే ఆ ప్రభుత్వాలను ఇంటికి పంపించిన ఘనత ఉద్యోగులదని చరిత్ర చెబుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళు తెరిచి ఎస్మా చట్టం పరిధిలోకి వర్తించని అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగ రంగంలో ఉన్న అన్ని వ్యవస్థలలో పనిచేసే ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిజాన్ని గ్రహించి ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎవరెస్ట్ బేస్ క్యాంపు వద్ద హనుమంతరావు చౌదరి, కుటుంబీకులు

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నూజివీడు వైద్యులు

నూజివీడు, జనవరి 7: నూజివీడుకు చెందిన వైద్యులు వరల్డ్ రికార్డ్ బుక్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నూజివీడుకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు హనుమంతరావు చౌదరి, గుండె వైద్య నిపుణుడు వి.రాఘవరావులు ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్‌ను అధిరోహించి భారత మువ్వన్నెల పతాకాన్ని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాప్ గ్లోబల్ వార్మింగ్ నినాదాన్ని హిమాలయాలపై ప్రదర్శించి హనుమంతరావు చౌదరి కుటుంబ సభ్యులు హార్వార్డ్ వరల్డ్ రికార్డ్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. 74 ఏళ్ల వయస్సులో ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించిన తొలి వ్యక్తిగా డాక్టర్ రాఘవరావు కూడా రికార్డులో నమోదయ్యారు. పిల్లల వైద్యుడు హనుమంతరావుతో పాటు ఆయన కుమార్తె తుమ్మల శ్రావణ సంధ్య, మనుమడు నరేన్ చౌదరి సైతం ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించటం విశేషం. దీంతో మూడు తరాలు సభ్యులు కలిసి ఒకేసారి ఎవరెస్ట్‌ను అధిరోహించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.



టిడ్కో ఇళ్లు ఇవ్వకుంటే ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి

▸▸ జనసేన అధికార ప్రతినిధి మరీదు

నూజివీడు టౌన్, జనవరి 7: సంక్రాంతికి టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు ఇవ్వకుంటే నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఇల్లు ముట్టడిస్తామని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో గత ప్రభుత్వంలో 3070 గృహాల నిర్మాణానికి కేంద్రం అనుమతులు మంజూరు చేయగా, 2668 టిడ్కో భవనాలు 80 శాతం పూర్తయ్యాయని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 20 శాతం పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్ళను ఇవాల్సి ఉండగా, ఇప్పటివరకు వాటిపై శ్రద్ధ పెట్టలేదన్నారు. దీనిపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తక్షణమే లబ్ధిదారులకు ఇళ్ళు పూర్తిచేసి అప్పగించాలని డిమాండ్ చేశారు. పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి కిషోర్, టౌన్ నాయకుడు ఎం.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామనడంపై శివరామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

13వ రోజుకు మునిసిపల్ కార్మికుల సమ్మె

నూజివీడు టౌన్, జనవరి 7: నూజివీడు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి జి.రాజు, ఏఐటీయూసీ కార్యదర్శి సిహెచ్ పుల్లారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవింద్, ఉషారాణి, గౌరీ, పంగిడమ్మ తదితరులు పాల్గొన్నారు.





తిరువూరులో చంద్రబాబు సభకు చనుబంద, నూజివీడు నుంచి వెళుతున్న టీడీపీ నాయకులు, అభిమానులు

అధినేత సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

చాట్రాయి, జనవరి 7: తిరువూరులో ఆదివారం జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు రా..కదిలిరా సభకు చాట్రాయి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్ళారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, నాయకుల కందుల కృష్ణ, పానుగళ్ళ కోటేశ్వరరావు, చీకటి చెన్నారావు, మండలపు జగదీష్, వెల్ది నాగేశ్వరరావు, కంచర్ల హనుమంతరావు తదితరులు చంద్రబాబు సభకు తరలివెళ్ళారు.

నూజివీడు టౌన్: నూజివీడు నుంచి తిరువూరు చంద్రబాబు సభకు టీడీపీ నాయకులు తరలివెళ్ళారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గంలోని మండలాల్లో గల పలు గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు తిరువూరులో నిర్వహిస్తున్న బహిరంగ సభకు తరలివెళ్ళాయి.

కైకలూరు: రా.. కదలి రా.. సభకు విచ్చేసిన చంద్రబాబుకు కైకలూరు టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు స్వాగతం పలికారు. ఆదివారం ఆచంటలో చంద్రబాబు నాయుడుని కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు కైకలూరు నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించి జనసేన-టీడీపీ కూటమిని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించినట్టు వెంకటేశ్వరరాజు తెలిపారు.



ఆచంటలో చంద్రబాబుకు పెన్మెత్స స్వాగతం



పదవులు అలంకారం కారాదు : చిన్నం

చాట్రాయి, జనవరి 7: ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే గెలిచిన నాయకులు పదవులను అలంకారప్రాయంగా భావించటం పెద్ద మోసం అవుతుందని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అన్నారు. సోమవరంలో ఆయన ప్రజలతో మాట్లాడుతూ 70 శాతం జరిగిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఐదేళ్ల ఆపటం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగనున్న రామకోటయ్యకు సీనియర్ కాంగ్రెస్ నేత, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రతికంటి రామచంద్రరావు మద్దతు తెలిపారు. సోమవరం రామాలయానికి ఏడెకరాలు భూమి ఉన్నా సాగునీరు లేక ఆదాయం రావటం లేదని గ్రామస్థులు రామకోటయ్యకు తెలపగా సొంత నిధులతో బోరు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కొత్తగూడెం శ్మశానవాటికలో బోరు వేసి చేతిపంపు ఏర్పాటు చేయిస్తానని చిన్నం హామీ ఇచ్చారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్

చాట్రాయి, జనవరి 7: మండలంలోని కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను బీజేపీ నాయకులు, అధికారులు ప్రజలకు వివరించారు. ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, ఎంఈవో బ్రహ్మాచారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు చక్రధరరావు, మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, నాయకులు సంజీవరెడ్డి, శర్మ, చెన్నారావు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మల్లెల మృతి

ఆగిరిపల్లి, జనవరి 7: టీడీపీ సీనియర్ నాయకుడు, ఆగిరిపల్లి మండలం సింహాద్రి అప్పారావుపేట గ్రామానికి చెందిన ప్రముఖులు మల్లెల ఆరోగ్యం (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య, మండల అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నీలపాల రమేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పామర్తి రామకోటి, మాజీ అధ్యక్షుడు దేరంగుల ఆంజనేయులు తదితరులు ఆయన మల్లెల భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సేవకు గుర్తింపుగా సత్కారం

ముదినేపల్లి, జనవరి 7 : శ్రీకృష్ణ యాదవ సంఘం ముదినేపల్లి మండల అధ్యక్షుడు, దాకరం పీఏసీఎస్ ఛైర్మన్ సోమా సత్యనారాయణను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ సత్కరించారు. ఆదివారం గుడివాడలో పట్టణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 2023లో సేవా కార్యక్రమాల నిర్వహణలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో ముందున్న సత్యనారాయణను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సంఘ నాయకుడు కఠారి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి లక్ష్యం



ముసునూరు, జనవరి 7: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిని ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన పైప్‌లైన్, ఇంటింటి కుళాయి పథకాన్ని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియాతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీలు కె.రాజా, పి.గంగాధరరావు, ఎంపీటీసీలు టి.కృష్ణకుమారి, చీలి లక్ష్మి, ఎంపీడీవో జి.రాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం ప్రారంభం

నూజివీడు టౌన్, జనవరి 7: రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు శాఖ కార్యాలయాన్ని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. నూజివీడు-పోతురెడ్డిపల్లి రహదారి పక్కనే గల ప్రాంగణంలో అసోసియేషన్ నూతన భవనంతో పాటు యునైటెడ్ కార్పెంటర్స్ అసోసియేషన్, నాయీ బ్రాహ్మణ సంఘ కార్యాలయాలను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసీపీ నాయకులు యార్లగడ్డ చంటి, అంజు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవింద్‌రావు, శేషయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

ముసునూరు, జనవరి 7: మండలంలోని చింతలవల్లి పంచాయతీ పరిధిలోని కొత్తూరులో ఆదివారం కోడిపందేల శిబిరంపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3500 నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.



కానుకొల్లులో మాట్లాడుతున్న విజయలక్ష్మి



గోపవరంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

ముసునూరు, జనవరి 7: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ నాయకుడు ఉప్పాలపాటి గణేష్ అన్నారు. ఆదివారం గోపవరం ఎస్సీ కాలనీ, వెంకటాపురంలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, సంక్షేమం పేరుతో ప్రతి పథకంలో అవినీతికి పాల్పడి, అభివృద్ధిని గాలికి వదిలివేసిందని, జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని గణేష్ కోరారు. నాయకులు మేరుగు ఏసుపాదం, బళ్ళవరపు రెడ్డియ్య, పొలిమేట్ల శ్రీను, సులోమోను, మేరుగు కిషోర్, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పండి

మండవల్లి: రాష్ట్రంలో వైసీపీ దుష్టపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పాలని కృష్ణాజిల్లా తెలుగు మహిళా నాయకురాలు కైకలూరు జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి కోరారు. కానుకొల్లులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రహదారులు అధ్వానంగా మారాయని, జగన్ ప్రజా సంక్షేమం పూర్తిగా విస్మరించారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీని తరిమికొట్టాలని కోరారు. టీడీపీ నాయకుడు కొడాలి వినోద్, ముదినేపల్లి మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.





కైకలూరు, మండవల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కైకలూరు, జనవరి 7: 1985-86వ సంవత్సరంలో కైకలూరు జడ్పీ ఓరియంటల్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కైకలూరులో సమయమంతుల పురుషోత్తం ఇంటి వద్ద కలుసుకుని ఆనందంగా గడిపారు. వారిలో పీహెచ్‌డీ రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏసీబీ ఐజీగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆయనను తోటి విద్యార్థులంతా సత్కరించారు. అనంతరం పాఠశాలను సందర్శించి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఎస్. పురుషోత్తంరావు, రెడ్డి శ్రీను, డి. సురేష్, గిరిజ, శ్రీలక్ష్మీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: చిన్ననాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులతో మండవల్లి జడ్పీహెచ్ పాఠశాల ఆవరణ ఆదివారం సందడిగా మారింది. 1995-96 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకుని నాటి స్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. పాఠశాలకు రూ.25లు విలువ చేసే ఇనుప బీరువా అందజేశారు. ఉపాధ్యాయులను, హెచ్ఎంను సత్కరించారు. నిర్వాహకులు గణేష్, షంషీర్ ఖాన్, వెంకటేష్, సురేష్, రమేష్, శ్రీనివాసరావు, రత్నారావు, కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రమాదాలు జరిగే చోట ఏర్పాటుకు సిద్ధమైన డ్రమ్ములు

ప్రమాద సూచికల ఏర్పాటుకు చర్యలు

ఆగిరిపల్లి, జనవరి 7: రహదారి భద్రత కోసం నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్ ఆదేశానుసారం ఆగిరిపల్లిలో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో స్టిక్కర్లు అంటించిన డ్రమ్ములను ఉంచుతున్నట్టు ఆగిరిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ నంబూరి చంటిబాబు తెలిపారు. వాహనదారులు సరైన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, హెల్మెట్లు ధరించాలని సూచించారు.


కాలనీలో విద్యుత్ పనులు ప్రారంభం



చాట్రాయి, జనవరి 7: మండలంలోని బూరుగ్గూడెం జగనన్న కాలనీలో విద్యుదీకరణ పనులను ఆదివారం రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి భూమి పూజచేసి ప్రారంభించారు. మండలంలోని అన్ని లే అవుట్లలో ఎన్నికల లోపు విద్యుదీకరణ పనులు పూర్తి చేయటానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని దేశిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సంజయ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

హిందువులంతా ఐక్యంగా మెలగాలి

▸▸ కమలానంద భారతి స్వామి



కలిదిండి, జనవరి 7 : హిందువులంతా ఐక్యంగా ఉండి హైందవ ధర్మాన్ని ఆచరించాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి అన్నారు. ఆదివారం కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో హిందూ ధర్మ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయానికి విదేశాల్లో కూడా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. కొన్ని దుష్ట శక్తులు సనాతన ధర్మాన్ని భ్రష్టు పట్టించే కుట్ర పన్నుతున్నాయన్నారు. హిందువులంతా సత్యాన్ని గురించి చైతన్యవంతులు కావాలన్నారు. హిందూ ధర్మ ప్రచారకులు పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, ఆత్రేయ బాబు, బాందు రాజు, కోకా రమేష్‌లు పాల్గొన్నారు.

మీసాల వేంకటేశ్వరస్వామికి లక్ష తులసీపూజ

కైకలూరు: ధనుర్మాసోత్సవాల సందర్భంగా కైకలూరు మీసాల వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం లక్షతులసి పూజను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బొప్పన శివకుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారి శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మికం



ఆంజనేయుడికి అర్చన



ముదినేపల్లి: ముదినేపల్లిలోని సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాదుగుల పూర్ణ, వత్తుమిల్లి ప్రసాద్, తిరుమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులు ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో అర్చన, పవన హోమం నిర్వహించారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు



కలిదిండి, జనవరి 7 : మండలంలో వాడవాడలా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను హిందూ ధర్మ ప్రచారకర్తలు పంపిణీ చేశారు. ఆదివారం కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో అక్షింతలను ఊరేగించిన అనంతరం ప్రతి ఇంటికి వాటిని పంపిణీ చేశారు. పెదలంక, మూల్లంక, సంతోషపురం, గుర్వాయిపాలెం గ్రామాల్లో అయోధ్య అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు.